# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 12-07-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వియత్నాంలో జరిగిన టూరిస్టు స్పీడ్ బోటు ప్రమాదంలో 15 మంది భారతీయులు మృతి చెందినట్లు అక్కడి భారత రాయబార కార్యాలయం అధికారికంగా వెల్లడించింది.**

2. **రాష్ట్ర ప్రభుత్వం ఇకపై జనాభా సంరక్షణ కార్యక్రమాలను చేపడుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**

3. **మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ సిఫార్సులకు అనుగుణంగానే చేపడతామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.**

4. **ఆంధ్రప్రదేశ్ లోని కడప జిల్లాలో కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత అధికారులను ఆదేశించారు.**

==========================

వియత్నాంలో జరిగిన టూరిస్టు స్పీడ్ బోటు ప్రమాదంలో 15 మంది భారతీయులు మృతి చెందినట్లు అక్కడి భారత రాయబార కార్యాలయం అధికారికంగా వెల్లడించింది. ప్రమాదానికి గురైన బోటులో మొత్తం 32 మంది భారతీయ పర్యాటకులు ప్రయాణిస్తున్నట్లు తెలిపింది. మృతుల్లో తమిళనాడుకు చెందిన 10 మంది, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు, కేరళకు చెందిన ఇద్దరు ఉన్నట్లు తెలిపారు. మిగిలిన ప్రయాణికులను వియత్నాం రక్షణ సిబ్బంది సురక్షితంగా ఒడ్డుకు చేర్చినట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్ పర్యాటకుల్లో కడపకు చెందిన నల్లపేట రవితేజ, ముడియం శ్రీధర్, మచిలీపట్నంకు చెందిన గెల్లి జయలక్ష్మి మృతి చెందారని తెలిపారు. మచిలిపట్నంకు చెందిన గెల్లి కిషోర్ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వెల్లడించారు.

---------------------------

వియత్నాంలోని ఫూ క్వాక్ సమీపంలో భారత పౌరులు ప్రయాణిస్తున్న పడవ ప్రమాదానికి గురైన ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో తమ వారిని కోల్పోయిన కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడి.. ప్రస్తుతం చికిత్స పొందుతున్న క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

---------------------------

వియత్నాంలో పర్యాటక బోటు ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోవడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. ప్రమాద ఘటన, బాధితులకు అందుతున్న సాయం, పర్యాటకుల ప్రస్తుత పరిస్థితిపై ముఖ్యమంత్రి అధికారులతో మాట్లాడారు. ప్రమాదంలో చిక్కుకుని ప్రాణాలతో బయటపడిన వారిని రాష్ట్రానికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరోవైపు ఈ ఘటనపై ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, మాజీ ముఖ్యమంత్రి వై. ఎస్. ఆర్. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

-----------------------------

రాష్ట్ర ప్రభుత్వం ఇకపై జనాభా సంరక్షణ కార్యక్రమాలను చేపడుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. విజయవాడలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నిన్న నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. భవిష్యత్తులో 'పిల్లలే సంపద' అనే భావనను కార్యరూపంలోకి తీసుకొస్తామని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో మొత్తం సంతానోత్పత్తి రేటు పెరగాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో జనాభా లేకపోతే అనేక సమస్యలు వస్తాయని పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

-----------------------------

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ సిఫార్సులకు అనుగుణంగానే చేపడతామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాదులోని సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్లతో కలిసి ఆయన నిన్న పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

వాయిస్..30 సెకన్లు

-----------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో రేపు పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా రాజమహేంద్రవరంలోని దవళేశ్వరం ప్రాజెక్టుకు పాత గేట్ల స్థానంలో 152 కోట్ల 95 లక్షల రూపాయల వ్యయంతో 117 కొత్త గేట్లు ఏర్పాటు పనులను ప్రారంభిస్తారు. అనంతరం పిచ్చుకలంక గ్రామంలో రైతులతో సమావేశమవుతారు. అక్కడ నుంచి పోలవరం చేరుకుని ప్రాజెక్టును సందర్శించనున్నారు. ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించడంతో పాటు టూరిజం హబ్ డిజైన్లను పరిశీలించి తుది ఆమోదం తెలపనున్నట్లు అధికారులు వెల్లడించారు.

-----------------------------

ప్రముఖ నేపథ్య గాయని ఎస్. జానకి కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆమె మైసూరులోని అపోలో ఆసుపత్రిలో నిన్న తుదిశ్వాస విడిచారు. ఆమె వయస్సు 88 సంవత్సరాలు. ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పల్లపట్ల గ్రామంలో 1938 ఏప్రిల్ 23న జన్మించిన ఎస్. జానకి, ఆరు దశాబ్దాలకు పైగా భారతీయ సినీ సంగీత రంగానికి విశిష్ట సేవలందించారు. తెలుగు, తమిళం,

కన్నడ, మలయాళం, హిందీతో పాటు పలు భాషల్లో 48 వేలకుపైగా పాటలు ఆలపించి విశేష గుర్తింపు పొందారు. ఎస్. జానకి మృతికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, ఎ.రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. పలువురు సినీ, సంగీత ప్రముఖులు, రాజకీయ నాయకులు, అభిమానులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ ఆమెకు ఘన నివాళులు అర్పించారు.

-----------------------------

రాజధాని అమరావతి పేరుతో భూములిచ్చే విషయంలో ఉండవల్లి రైతులపై ప్రభుత్వం వ్యవహరించిన తీరును ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తప్పుబట్టారు. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా పోలీసులను మోహరించి, బుల్డోజర్లతో సాగులో ఉన్న పంటలను ధ్వంసం చేయడం దుర్మార్గమని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. సన్న, చిన్నకారు రైతుల జీవనాధారమైన భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోవడం అన్యాయమని పేర్కొన్నారు.

-----------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. దేశంలో ప్రతిపాదిత 7 హైస్పీడ్ రైల్ కారిడార్లలో మూడు కారిడార్లకు హైదరాబాద్ కేంద్రంగా మారనున్నట్లు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల అమలుకు కేంద్ర ప్రభుత్వం దాదాపు 5 లక్షల కోట్ల రూపాయల వ్యయం చేయనున్నట్లు వెల్లడించారు. హైస్పీడ్ రైల్ కారిడార్లతో హైదరాబాద్ దేశంలో కీలక రవాణా కేంద్రంగా మారనుందని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

-----------------------------

సోషల్ మీడియాతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే చట్టాన్ని తీసుకురానుందని ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని టిడిపి కార్యాలయంలో నిన్న నిర్వహించిన ప్రజాదర్బార్ లో భాగంగా మంత్రి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ లోని కడప జిల్లాలో కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత అధికారులను ఆదేశించారు. కడపలో 8 కరోనా కేసులు నమోదవడంతో పాటు ఇద్దరు మృతి చెందడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా ప్రభావిత ప్రాంతాల్లో కొవిడ్ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని, ప్రజల్లో అవగాహన కల్పించాలని, రద్దీ ప్రాంతాలు, ఆసుపత్రుల్లో మాస్కుల వినియోగాన్ని తప్పనిసరి చేయాలని జిల్లా కలెక్టర్ కు ఫోన్ లో సూచించారు. కరోనా లక్షణాలున్న వారికి పరీక్షలు నిర్వహించి, పాజిటివ్‌గా తేలితే ఐసోలేషన్‌కు తరలించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ ప్రస్తుతం ఎనిమిది కేసులు నమోదయ్యాయని, కొత్త కేసులు లేవని మంత్రికి వివరించారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్, యానంలలో దిగువ ట్రోపో ఆవరణములో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందిని వాతావరణ కేంద్ర అధికారి ఎల్. నారాయణ వెల్లడించారు.

తెలంగాణలో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

======================